సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం : 31 : జూలై : 2023



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారానికి 24.560 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 1,953 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,517
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,683
సవర (8 గ్రాములు)	రూ.45,464

గరిష్టం/కనిష్టం
34.3 /28.2

వాతావరణం
ఆదివారం గాలిలో తేమ 59 శాతం ఉంది. సోమవారం వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

5న గ్రూప్‌-4 అభ్యర్థులకు సీపీటీ పరీక్ష
నెల్లూరు(దర్గామిట్ట): రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీ కోసం గత ఏప్రిల్ నెలలో నిర్వహించిన రాత పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులకు 1:2 నిష్పత్తిలో సీపీటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 5వ తేదీ ఉదయం కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహిస్తారని, అర్హత సాధించిన అభ్యర్థులు సీపీటీ పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డు, గెజిటెడ్ అధికారి సంతకం చేసిన ఫొటో ప్రూఫ్‌లతో పరీక్షకు హాజరుకావాలని తెలిపారు.

నేటి స్పందన రద్దు
నెల్లూరు(దర్గామిట్ట): స్థానిక కలెక్టరేట్‌లో, ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం(స్పందన) రద్దు అయింది. జిల్లా అధికారులు రొట్టెల పండగ విధినిర్వహణలో ఉండడం వల్ల ఈ కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ కార్యాలయం అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రం మినహా మిగిలిన అన్ని మండల, డివిజన్ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుంది.

పోలీసు కార్యాలయంలో..

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని రొట్టెల పండగ నేపథ్యంలో రద్దు చేసినట్లు ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోర్టులో డీఏపీ దిగుమతి
ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నంపోర్టులో డై అమ్మోనియం సల్ఫేట్(డీఏపీ) దిగుమతి జరుగుతున్నట్లు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా టాబిన్ 136 అనే నౌక నుంచి 27,500 టన్నుల డీఏపీ దిగుమతి చేస్తున్నారు. అలాగే, ఆక్వావిటా స్కై అనే నౌక నుంచి 33,000 టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోంది. రిప్లే ప్రైడ్ అనే నౌక నుంచి 74,500 టన్నులు, డక్కన్ ప్రైడ్ అనే నౌక నుంచి 74,300 టన్నుల బొగ్గు దిగుమతి చేస్తున్నారు.

బ్రాహ్మణ మహాసభ నూతన కార్యవర్గ ఎన్నిక
నెల్లూరు(బృందావనం): నగరంలోని గాంధీ బొమ్మ వద్ద ఉన్న టీవీఎస్ కల్యాణ సదన్‌లో ఆదివారం బ్రాహ్మణ మహాసభ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణా డిస్ట్రిక్ట్ అడిషనల్ సెషన్స్ జడ్జి వెన్నెలకంటి విజయశ్రీనివాసమూర్తి హాజరయ్యారు. బ్రాహ్మణ మహాసభ గౌరవాధ్యక్షుడిగా బి.ఫణికృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్వీఎల్ వరప్రసాదరావు, కె.ఎల్.నారాయణ, కోశాధికారిగా సి.శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులుగా పి.వేణుగోపాల్, జి.వాసుదేవరావు, సహాయ కార్యదర్శిగా ఎస్.సుబ్రహ్మణ్యం, సభ్యులుగా జి.శింగరాచార్యులు, పీవీఎస్ శివప్రసాద్, టీకే శ్రీనివాసమూర్తి, బి.ఎస్.రంగరాజన్‌లను ఎన్నుకున్నారు.



దర్గాను దర్శించుకుంటూ..



స్వర్ణాల తీరంలో భక్తజన సందోహం



సింహపురి దారులన్నీ బారాషహీద్ దర్గా వైపే మళ్లాయి. రొట్టెల పండగలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వర్ణాల చెరువును చేరుకుని కోర్కెల రొట్టెలను పట్టుకుని తమ ఆకాంక్షలు నెరవేరాలని మొక్కుకున్నారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గంధాన్ని షహీదుల సమాధులకు లేపనం చేసిన అనంతరం భక్తులకు పంచిపెట్టారు.

వరాల రొట్టె అందుకుందాం



రొట్టెల పండగకు పోటెత్తిన భక్తులు
- భక్తజనసంద్రమైన స్వర్ణాల
- వేడుకగా గంధ మహోత్సవం
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరుగుతున్న రొట్టెల పండగకు రెండో రోజు ఆదివారం కూడా భక్తులు పోటెత్తారు. కోర్కెలు తీరిన భక్తులు స్వర్ణాల చెరువులో స్నానమాచరించి రొట్టెలు వదలగా.. కోర్కెలు తీరాలని వచ్చిన భక్తులు రొట్టెలు పట్టుకున్నారు. అనంతరం బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని సమాధులను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

జనసంద్రంగా స్వర్ణాలచెరువు

దర్గా ప్రాంగణంలోని స్వర్ణాలచెరువు జనసంద్రంగా మారింది. లక్షలాది మంది భక్తజనంతో స్వర్ణాల తీరం పులకించిపోయింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులే కాక, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. మదినిండా కోర్కెలతో విచ్చేసిన భక్తులు తమ ఆకాంక్షలు తీరాలంటూ రొట్టెలు పట్టుకున్నారు.

వెలసిన రొట్టెల బోర్డులు

స్వర్ణాల చెరువు సమీపంలో రొట్టెల బోర్డులు వెలిశాయి. ప్రధానంగా విద్య, ఆరోగ్య, సౌభాగ్య, ఉద్యోగ, వివాహ, సంతాన రొట్టెలు బోర్డులు కన్పిస్తున్నాయి. భక్తులు ఆయా రొట్టెలను బహూకరించడం, తిరిగి కొత్త రొట్టెను పొందడం ఆనవాయితీ. ఈ ఏడాది ఎక్కువ మంది ఆరోగ్య రొట్టెను, వివాహ, ఉద్యోగ, ఐశ్వర్య, సంతాన, గృహ రొట్టెల కోసం కదలివచ్చారు.

భక్తులకు సౌకర్యాలు

శని, ఆది వారాలు సెలవు దినాలు కావడంతో రొట్టెల పండగకు భక్తులు పోటెత్తారు. మరో మూడు రోజులపాటు నిర్వహించే రొట్టెల పండగలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. అధికారులు భక్తులకు కల్పించిన సౌకర్యాలు, ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసుశాఖ సీసీ కెమెరాల మానిటరింగ్ కేంద్రం నుంచి అన్ని ప్రాంతాలను పరిశీలిస్తోంది. అలాగే రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పోటాపోటీగా వైద్యశిబిరాలు

దర్గా వద్ద భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా ప్రాథమిక చికిత్స అందించేందుకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్యఆరోగ్యశాఖతోపాటు కార్పొరేట్ ఆస్పత్రులు, రెడ్‌క్రాస్, ఆయుష్ విభాగాలు వైద్యశిబిరాలను పోటాపోటీగా ఏర్పాటు చేశాయి.



భక్త సు'గంధం'
నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా గంధ మహోత్సవం ఆదివారం రాత్రి వేడుకగా సాగింది. కోటమిట్టలోని అమీనియా మసీదులో సంప్రదాయంగా మతపెద్దలు, పీఠాధిపతుల ఆధ్వర్యంలో అత్తరు.. సుగంధ ద్రవ్యాలు.. పన్నీరు కలిపిన పవిత్ర గంధాన్ని 12 బిందెలలో భక్తిశ్రద్ధలతో కలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, నమాజులు చేసి గంధం బిందెలను ఎత్తుకున్నారు. ప్రత్యేక వాహనంపై కోటమిట్ట, జెండావీధి, పెద్ద బజారు, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీసు కార్యాలయం, డీకేడబ్ల్యూ కళాశాల మీదుగా దర్గామిట్టలోని స్వర్ణాల చెరువు వద్ద ఉన్న బారాషహీద్ దర్గా వద్దకు చేరుకున్నారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు(దువా, సమ) చేశారు. ఆ గంధాన్ని బారాషహీద్‌ల సమాధులపై లేపనం చేసి భక్తులకు పంచిపెట్టారు.



బారాషహీద్ దర్గా వైపు పయనిస్తూ..



విద్యుద్దీప కాంతుల్లో దర్గా ప్రాంగణం



రొట్టె అందుకుంటున్న ఎంపీ బీద మస్తాన్‌రావు



షార్ కేంద్రం నుంచి మొదటి దశతో నింగి వైపు దూసుకెళుతున్న పీఎస్‌ఎల్‌వీ సీ56 రాకెట్

- నింగికెగసిన రాకెట్
- 58వ పర్యాయం పీఎస్‌ఎల్‌వీ ప్రయోగం
- కక్ష్యలోకి చేరిన సింగపూర్ ఉపగ్రహాలు
- వాణిజ్యపరంగా మరోసారి సత్తా చాటిన ఇస్రో

గఘన విజయం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరోమారు సత్తా చాటింది. వాణిజ్యపరమైన ప్రయోగాల్లోనూ తిరుగులేదని నిరూపించింది. ఇస్రో శాస్త్రవేత్తల అవిశ్రాంత కృషి ఫలించింది. పీఎస్‌ఎల్‌వీ సీ56 గగనతలం వైపు దూసుకెళ్లింది. విదేశీ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ క్రమంలోనే పీఎస్‌–4లో భాగంగా ఓ ప్రత్యేక పరికరంతో సరికొత్త పరిశోధనలు చేపట్టనుంది. శాటిలైట్స్‌కు అడ్డంకిగా మారే అంతరిక్ష వ్యర్థాలను పసిగట్టి పక్కకు తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఆదివారం ఉదయం 6.31 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ56 ఉపగ్రహ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) విజయవంతంగా నిర్వహించింది. ఈ ఏడాదిలో ఇది ఆరో ప్రయోగం కాగా, వాణిజ్యపరంగా మూడో ప్రయోగం కావడం విశేషం. షార్ శాస్త్రవేత్తలు శనివారం ఉదయం 5.01 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభించారు. 25.30 గంటలు కొనసాగిన అనంతరం పీఎస్‌ఎల్‌వీ సీ56 రాకెట్ ఉదయభానుడి లేత కిరణాలను చీల్చుకుంటూ రివ్వుమంటూ గగనతలం వైపునకు దూసుకెళ్లింది. ఈ ప్రయోగంలో 422 కిలోల బరువు గల సింగపూర్‌కు చెందిన 7 ఉపగ్రహాలను మోసుకెళ్లింది. భూమికి 535 కిలోమీటర్ల ఎత్తులోని నియో ఆర్బిట్ (భూ సమీప కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీంతో ప్రపంచంలోనే వాణిజ్యపరమైన ప్రయోగాలకు తిరుగులేని దేశంగా భారత్ ఆవిర్భవించింది.

వివిధ దశల్లో ప్రయోగం

- ➡ పీఎస్‌ఎల్‌వీ సీ56 రాకెట్ 44.4మీటర్ల పొడవు.
- ➡ రాకెట్ ప్రయోగ సమయంలో 228.642 టన్నుల బరువుతో నింగికి పయనం కాగా 23 నిమిషాల్లో శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని పూర్తి చేశారు.
- ➡ మొదటిదశలో 139 టన్నుల ఘన ఇంధనం సాయంతో ఏడు ఉపగ్రహాలను నింగికి పంపించారు.
- ➡ 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 109.8 సెకెండ్లలో పూర్తి చేశారు.
- ➡ 110 సెకెండ్లకు రెండోదశ ప్రారంభించారు.
- ➡ రాకెట్ నింగి వైపునకు వెళుతున్న సమయంలో 184.9 సెకెండ్లకు రాకెట్ శిఖర భాగాన అమర్చిన ఉపగ్రహాలకు సంబంధించి హీట్‌షీల్డ్‌లు విడిపోయాయి
- ➡ అనంతరం 40 టన్నుల ద్రవ ఇంధనాన్ని వినియోగించి 262.3 సెకెండ్లకు రెండోదశను పూర్తి చేశారు.
- ➡ 263.3 సెకెండ్లకు మూడోదశను ప్రారంభించారు.
- ➡ 76 టన్నుల ఘన ఇంధనం సాయంతో 583.6 సెకెండ్లకు మూడో దశను పూర్తిచేశారు.



మొదటి దశ పూర్తయి రెండో దశ మండుతూ..

- ➡ 848.8 సెకెండ్లకు నాలుగోదశను ప్రారంభించారు.
- ➡ 1120.5 సెకెండ్లకు నాలుగో దశను కటాఫ్ చేసి దానికి పైభాగంలో అమర్చిన ఏడు ఉపగ్రహాలను ఒక్కొక్కటిగా కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.
- ➡ 1167.5 సెకెండ్లకు 352 కిలోలు బరువు కలిగిన డీఎ–ఎస్‌ఏఆర్ (షార్ట్ ఫర్ సింథటిక్ అపార్చర్ రాడార్)అనే ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను భూమికి 535 కిలోమీటర్ల ఎత్తులోని నియో ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.
- ➡ 1177.9 సెకెండ్లకు మూడు కేజీల బరువు గల నులయిన్ అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- ➡ 1222.6 సెకెండ్లకు 13 కిలోలు బరువు గల ఓఆర్‌బీ–12 స్ట్రైడర్ అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- ➡ 1236.9 సెకెండ్లకు 3.5 కేజీల బరువు టలగలాసియో అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- ➡ 1267.9 సెకెండ్లకు నాలుగు కిలోల బరువు గల స్కూబ్–11 అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- ➡ 1327.5 సెకెండ్లకు 24 కిలోల బరువు గల ఆర్కేడ్ అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.

పీఎస్‌-4తో మరో పరిశోధన
పీఎస్‌ఎల్‌వీ సీ56 రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్‌–4)తో సరికొత్త పరిశోధనలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. ఏడు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత డీఆర్బిటింగ్ ఎక్స్‌పెరిమెంట్ చేయనున్నారు. భూ సమీప కక్ష్యలో ఉన్న ఉపగ్రహ వ్యర్థాలను తొలగించేందుకు ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టనున్నారు. భూమికి 535 కిలోమీటర్లు ఎత్తులో ఉపగ్రహాలను ప్రవేశపెట్టిన తర్వాత పీఎస్‌- 4 అక్కడ నుంచి 300 కిలోమీటర్లు కిందికి వచ్చి వ్యర్థాలను పసిగట్టి వాటిని దూరంగా జరిగేలా చేస్తుంది. స్పేస్‌లో వున్న డెబ్రిస్ (అంతరిక్షంలో వ్యర్థాలు) తొలగించి కొద్ది రోజుల తర్వాత సముద్రంలో పడిపోయేలా శాస్త్రవేత్తలు పీఎస్‌–4ను డిజైన్ చేయడం విశేషం.



నాలుగో దశతో డీఎ–ఎస్‌ఏఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలిపెడుతూ..

- ➡ 1382 సెకెండ్లకు (23 నిమిషాల వ్యవధిలో) వెలాక్స్–ఎంఎం అనే చివరి ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టి ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

సందడే సందడి

పీఎస్‌ఎల్‌వీ సీ56 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఏపీతోపాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నంచి నుంచి సుమారు 10 వేల మంది వరకు విచ్చేశారు. అలాగే పులికాట్ సరస్సు పరిసరాల్లో సైతం పెద్దసంఖ్యలో ప్రజలు చేరి ప్రయోగాన్ని వీక్షించారు. రాకెట్ నింగికెగసిన సమయంలో ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో ఆ ప్రాంతం మార్మోగింది.

వైభవంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం



శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

- భక్తిశ్రద్ధలతో తిరుమల వాసుడికి సేవలు

నెల్లూరు(బృందావనం): పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పురమందిరంలో ఆదివారం రాత్రి శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అన్నమాచార్య ఆరాధన సమితి నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తిరుపతికి చెందిన అర్చకులు శ్రీమాన్ తనూజ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి సేవలు

ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుడికి సుప్రభాతం, తోమాలసేవ, అర్చన, తిరుప్పావడ తదితర పూజాదికాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆయా సేవల్లో, కల్యాణ మహోత్సవంలో పాల్గొని విశేషాలంకారంలో కొలువైన స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల గోవింద నామస్మరణతో పురమందిరం పరవశించింది. కార్యక్రమాలను అన్నమాచార్య ఆరాధన సమితి గౌరవాధ్యక్షుడు కె.సుబ్బరాజు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు కేవీ సుధాకర్‌రాజు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, సమన్వయకర్త దోర్నాల హరిబాబు, అన్నమాచార్య ఆరాధన సమితి సభ్యులు శ్రీవారి సేవకులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ
నెల్లూరు(లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది రాయసం విఠల్‌బాబును కిడ్నాప్ చేసి దారుణ హత్య చేసిన ఘటనకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా, ట్రెజరర్ ధన్పాల్ రమేష్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి న్యాయవాది హత్యను ఖండిస్తూ నిరసనగా కోర్టు విధులు బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

పేదల ఇళ్లు.. పంపిణీకి సిద్ధం

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన జీ+3 గృహాలు
- సకల మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం
- త్వరలో 1,408 ఇళ్లు లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు


ప్రారంభానికి సిద్ధమైన జీ+3 గృహాలు

కందుకూరు: గత ప్రభుత్వం అరకొర పనులతో వదిలేసిన జీ+3 పేదల ఇళ్లను సకల వసతులతో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం సిద్ధం చేసింది. పెండింగ్ పనులను పూర్తి చేసి నివాసానికి అనుకూలంగా సిద్ధం చేయడంతోపాటు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించింది. దీంతో గృహ ప్రవేశం కోసం ఎదురుచూస్తున్న పేదల కల త్వరలోనే నెరవేరనుంది.

1,408 ఇళ్ల నిర్మాణం

ఉప్పుచెరువులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో దాదాపు 1,408 గృహాలను జీ+3 మోడల్‌లో ప్రభుత్వం నిర్మించింది. మూడు కేటగిరీలు కింద ఇళ్ల నిర్మాణం చేపట్టింది. 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్‌రూమ్ గృహాలు, 360 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో కూడా ఇళ్లు నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలను ప్రారంభించినా వాటిని పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారు. దాదాపు మూడేళ్లపాటు కేవలం బిల్డింగ్‌ల నిర్మాణం మాత్రమే పూర్తి చేసి వదిలేశారు. రోడ్లు, డ్రైనేజీలు, గృహాల లోపల ఇంటీరియర్ పనులు ఎక్కడివి అక్కడే పెండింగ్ పెట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు పూర్తి చేయడంపై దృష్టి పెట్టింది. నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు విశాలమైన అంతర్గత రోడ్లు నిర్మాణం చేపట్టింది. అలాగే ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడంతో పాటు ఆధునిక మురుగు నీటి సౌకర్యాన్ని కల్పించారు. అలాగే పెండింగ్ ఉన్న గృహాల్లోపల ఇంటీరియర్ పనులను పూర్తి చేశారు. ప్రస్తుతం పనులన్నీ పూర్తి కావడంతో త్వరలోనే పేదలకు ఇళ్లు అప్పగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

లబ్ధిదారులకు నోటీసులు

ఈ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను గత ప్రభుత్వం ఎంపిక చేసింది. వారితో బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేయించారు. అయితే చాలా మంది బ్యాంకు లింకేజీని పూర్తి చేయలేదు. అలాగే తమ వాటా కింద చెల్లించాల్సిన నగదును కూడా చెల్లించలేదు. అప్పట్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో స్థానికులు కాని వారు కూడా అనేక మంది ఉన్నారు. దీంతో ప్రస్తుతం మున్సిపల్ అధికారులు వారందరికీ పలుమార్లు నోటీసులు జారీ చేశారు. జీ+3లో గృహాలు పొందిన వారు బ్యాంకు లింకేజీని పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన లబ్ధిదారుల వాటాను కూడా చెల్లించాలని నోటీసుల్లో కోరారు. మొత్తం 1408లో దాదాపు 153 మంది వరకు కందుకూరు అడ్రస్‌లో లేనట్లు గుర్తించారు. వీరంతా స్థానికులు కాదని, ఇతర ప్రాంతాలకు చెందిన వారని అధికారులు విచారణలో తేలినట్లు సమాచారం. అప్పటి టీడీపీ నాయకులు స్థానికేతరుల పేర్లను పెట్టి గృహాలు పొందినట్లు తేలింది. ఈ నేపథ్యంలో స్థానికులు కాకుండా గృహాలు పొందిన వారి పేర్లను రద్దు చేసి, వారి స్థానంలో కొత్తవారికి ఇళ్లు కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పంపిణీ చేయాలనే సంకల్పంతో పనులు

ప్రస్తుతం గృహాలు, మౌలిక వసతులకు సంబంధించి పనులన్నీ పూర్తయినా మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టీపీసీ) పనులు సాగుతున్నాయి. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన టిడ్కో అధికారులు చేపడుతున్నారు. వీలైనంత త్వరగా ఈ పనులు కూడా పూర్తి చేసి గృహాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు.

త్వరలోనే గృహాలను అప్పగిస్తాం

టిడ్కో గృహాలకు సంబంధించి పెండింగ్ పనులన్నీ పూర్తి చేశాం. మురుగునీటికి సంబంధించి ఎస్‌టీపీసీ ప్లాంట్ నిర్మాణం జరుగుతోంది. ఈ ప్లాంట్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. వీలైనంత త్వరగా పేదలకు ఇళ్లు అప్పగించాలనే కృత నిశ్చయంతో ఉన్నాం. అతిత్వరలోనే జీ+3 గృహాలనే లబ్ధిదారులకు అప్పగిస్తాం.
– మనోహర్, మున్సిపల్ కమిషనర్

రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని 28వ డివిజన్‌లో సీసీడ్రెయిన్, 26వ డివిజన్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. విజయ డైయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వేబోర్డు సభ్యుడు వెంకయ్య, నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హరిబాబు యాదవ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట దర్గాలో భక్తుల సందడి


హజరత్ వారి దర్శనానికి క్యూలో భక్తులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఏఎస్‌పేట దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా భక్తులు ఏఎస్‌పేటకు చేరుకుని హజరత్ నాయబ్ రసూల్ వారి దర్గాను దర్శించుకున్నారు. దర్గాకు వచ్చిన భక్తులకు పీఠాధిపతులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. తాగునీరు, భోజన వసతులు కల్పించారు. దర్గా వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు.


దర్గాలో సేదతీరుతున్న భక్తులు

క్లుప్తంగా

గంగమ్మ సేవలో కేంద్ర మంత్రి


సారె తీసుకువస్తున్న కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్

తిరుపతి కల్చరల్ : తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ తల్లిని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ సారెను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథ్, నాయకులు సుబ్రమణ్యం యాదవ్, దీపక్, చెంగారెడ్డి, సురేష్ స్వామి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు యాదవ్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,115 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,243 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

తిరుపతి-తిరుత్తణికి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్ : ఆడికృత్తికను పురస్కరించుకుని ఆగస్టు 8, 9వ తేదీల్లో తిరుపతి-తిరుత్తణి నడుమ ప్రత్యేక బస్సులు నడపనున్నారు. తిరుపతి జిల్లా నుంచి 80, తమిళనాడు నుంచి 38 సర్వీసులను నడిపేందుకు రెండు రాష్ట్రాల ప్రజారవాణా అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. జిల్లా నుంచి ప్రధానంగా తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, నాయుడుపేట నుంచి తిరుత్తణికి అదనపు సర్వీసులు నడుపుతున్నామని అధికారులు వెల్లడించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రసాయన శాస్త్రంపై అవగాహన


విద్యార్థులతో ప్రొఫెసర్ గణేష్

ఏర్పేడు : మండలంలోని జంగాలపల్లె వద్ద ఆదివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో 34 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 81 మంది 9వ తరగతి విద్యార్థులకు రసాయన శాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ గణేష్ మాట్లాడుతూ మానవజాతి అభ్యున్నతికి రసాయన శాస్త్రం ఎంతో ఉపయోగపడిందన్నారు. యువ విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడమే కాకుండా రసాయన శాస్త్రంపై మక్కువ పెంచేందుకే ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయమోహన్ పిళ్లై, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి పాల్ లూయిస్, డాక్టర్ యూసుఫ్ హమీద్ పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు


గోపమ్మకు చెక్కు అందజేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు చేరుతున్నాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలం సోమశిల సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు, ప్రజాసమస్యలపై ఆరాతీశారు. ఎస్సీ కాలనీవాసులు సీసీరోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని కోరగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సిద్ది గోపమ్మ అనే వితంతువు తనకు పింఛన్ రావడం లేదని ఎమ్మెల్యేకు మొరపెట్టుకోగా వెంటనే స్పందించి తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు అందజేశారు. త్వరలోనే పింఛన్ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మన రాష్ట్రం పారిశ్రామికప్రగతిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. తన సోదరుడు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి గతంలో ప్రారంభించిన అనేక పనులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. హైలెవల్ కెనాల్, నారంపేట ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత జాబితాను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే రెండు జాబ్ మేళాలు నిర్వహించి 700 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని తెలిపారు. సెప్టెంబరులో మరో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే మూడు జాతీయ రహదారులు, రైల్వేలైన్ నిర్మాణం జరుగుతోందని, లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సోమశిల రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని కేంద్ర రవాణా శాఖ మంత్రికి విన్నవించామని చెప్పారు. వారం రోజుల క్రితం నియోజకవర్గంలోని పలు రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని వివివరించారు. ఈ కార్యక్రమంలలో జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కోర్డినేటర్ ఏ అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కే రామకృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ పెంచలయ్య, ఎంపీటీసీ సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండుబోయిన ఈశ్వరయ్య, ముక్కు మస్తానయ్యగౌడ్, వెంకటరమణ, ఏ శ్రీనివాసులురెడ్డి, పోలిరెడ్డి, మహబూబ్‌బాషా, సుబ్బారెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, తహసీల్దార్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


సెంచరీ సాధించిన నెల్లూరు జట్టు క్రీడాకారిణి ఐశ్వర్యరాయ్


బౌలింగ్‌లో సత్తా చాటిన కడప జట్టు క్రీడాకారిణి వైష్ణవి

వెంకటగిరి : పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. గ్రౌండ్-1లో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 39.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసి గెలుపొందింది. గ్రౌండ్- 2లో కడప- చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. కడప జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 40.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసి విజయం సాధించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన కసుమూరులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన ఇలియాజ్ బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా, వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇలియాజ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ లైవ్	రూ.130
లేయర్ లైవ్	రూ.88
బ్రాయిలర్ చికెన్	రూ.226
స్కిన్‌లెస్ చికెన్	రూ.250
లేయర్ చికెన్	రూ.150

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.35
సన్నవి	రూ.23
పండ్లు	రూ.7



రొట్టెల పండగకొచ్చి విషాదం

- రైలు ఢీకొని తల్లీకూతుళ్ల దుర్మరణం
- మూత్ర విసర్జనకు వెళ్తుండగా ఘటన


ఫాతిమున్నీసా మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్సై ఎన్ హరిచందన

నెల్లూరు(క్రైమ్): మూత్ర విసర్జనకు రైలు పట్టాల మీద నడుచుకుంటూ వెళుతున్న తల్లీకుమార్తెను రైలు ఢీకొనడంతో మృతి చెందారు. ఈ హృదయ విదారక ఘటన ఆత్మకూరుబస్టాండు సమీపంలో రైలుపట్టాలపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు...గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన ఫాతిమా అలియాస్ ఫాతిమున్నీసా(60)కు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికి వివాహమైంది. పెద్ద కుమార్తె మెహరున్నీసా శింగరాయకొండ, చిన్నకుమార్తె గౌసియా(35)కందుకూరులో ఉంటున్నారు. రొట్టెల పండగకు తల్లీకుమార్తెలు కలిసి ఆదివారం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకొచ్చారు. దర్గాను సందర్శించుకుని హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో మెహరున్నీసా రైల్వేస్టేషన్‌లో ఉండగా ఫాతిమున్నీసా, గౌసియా మూత్రవిసర్జన చేసేందుకు రైలుపట్టాల వెంబడి ఆత్మకూరుబస్టాండ్ వైపు వెళ్లారు. రైల్వే బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి నిజాముద్దీన్ వెళుతున్న రైలు వారిని ఢీకొంది. ఫాతిమున్నీసా అక్కడికక్కడే మృతి చెందగా గౌసియా రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు 108 సాయంతో చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌసియా మృతి చెందింది. తల్లి, చెల్లెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మెహరున్నీసా కన్నీటిపర్యంతమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై ఎన్ హరిచందన పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పోలీసు గస్తీ ఏర్పాటు

గతంలోనూ ఇదే ప్రాంతంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. రైల్వే పోలీసులు గస్తీని ఏర్పాటు చేసిన ప్రయాణికులు పెడచెవిన పెట్టి రైలుపట్టాలపై రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. ఆదివారం తల్లీకుమార్తె రైలుపట్టాలపై వెళుతుండగా, అటుగా వెళుతున్న వారు వారిస్తుండగానే రైలు వారిని ఢీకొంది. దీంతో రైల్వే పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేశారు.